'ఆడుదాం ఆంధ్రా'కు విశేష స్పందన

నియోజకవర్గంలో 1,782 మంది క్రీడాకారుల పేర్లు నమోదు

ఆకివీడు: 'ఆడుదాం ఆంధ్రా' ప్రత్యేక క్రీడా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఆసక్తి గల క్రీడాకారులు ప్రతిభను కనబర్చుకునేందుకు తమ పేర్లను నమోదు చేయించుకుంటున్నారు. 'ఆడుదాం ఆంధ్రా'లో క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో జరగనున్నాయి. ప్రభుత్వం ఆయా పంచాయతీలకు క్రీడా కిట్లను పంపిణీ చేసింది. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు శుక్రవారం నుంచి ఆయా గ్రామాల్లో తర్ఫీదు పొందుతున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి గ్రామ స్థాయిలో క్రీడా పోటీలు జరగనున్నాయి. గ్రామ స్థాయి పోటీల్లో గెలుపొందినవారు మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంది. గ్రామ స్థాయిలో గెలుపొందిన టీమ్‌కు రూ.15 వేలు నగదు, రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన టీమ్‌కు రూ.60 వేలు నగదు బహుమతిని ప్రభుత్వం అందజేయనున్నది. 15 సంవత్సరాల నుంచి 50 ఏళ్లలోపు వారంతా పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.


దుంపగడపలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ క్రీడలో తర్ఫీదు పొందుతున్న క్రీడాకారులు

క్రీడాకారులు, ప్రేక్షకుల పేర్లు నమోదు

క్రీడాకారులు, క్రీడల్ని తిలకించే ప్రేక్షకుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారు. ఉండి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన క్రీడాకారులు 1,782 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. గ్రామాల్లో తర్ఫీదు కొనసాగుతోంది. ఆయా మండలాల పరిధిలో 300 నుంచి 600 మంది క్రీడా ప్రేక్షకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

నియోజకవర్గంలో నమోదైన క్రీడాకారులు, క్రీడా స్థలం

ఆకివీడు	647	7
కాళ్ల	494	5
ఉండి	381	6
పాలకోడేరు	260	5
మొత్తం	1,782	23

ప్రోత్సాహం బాగుంది

గ్రామీణ క్రీడాకారుల్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం వినూత్నన రీతిలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల్ని నిర్వహించడం ఆనందంగా ఉంది. క్రీడల పట్ల ఆసక్తి ఉండి, అవకాశం లేని క్రీడాకారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. తమ ప్రతిభను కనబర్చే అవకాశం ఉంది. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం అభినందనీయం. గ్రామీణ స్థాయిలో కబడ్డీ పోటీలు ఆడిన నేను ఉత్తరాఖాండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

– చేబ్రోలు సాయి గణేష్, కబడ్డీ క్రీడాకారుడు.

గ్రామీణ క్రీడాకారులకు అవకాశం

'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ద్వారా క్రీడాకారుల్ని ప్రోత్సహించడం హర్షదాయకం. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చుకునేందుకు మంచి వేదికను సీఎం జగన్ ఇవ్వడం అభినందనీయం. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు యువతతో పాటు గ్రామాల్లోని 50ఏళ్ల లోపు వ్యక్తులు కూడా పాల్గొని తమ ప్రతిభను కనబర్చవచ్చు.

– మద్దా బాలస్వామి, క్రీడాకారుడు.

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: తుపాను నేపథ్యంలో రొయ్య, చేపల రైతులు ఎప్పటికప్పుడు తమ చెరువులను పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎల్ఎన్ రాజు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను కారణంగా ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగవచ్చని జనరేటర్లు, డిజిల్ ఆటో ఇంజిన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాలు కురిసి ఆకాశం మేఘావృతమై ఉండటంతో చెరువులో ఆక్సిజన్ శాతం తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని, ఆక్సిజన్ ట్యాబ్లెట్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంతేకాక భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున చెరువును పూర్తిస్థాయిలో నీటి మట్టంతో నింపకుండా రెండు అడుగుల మేర నీటిని తగ్గించాలన్నారు. చెరువుల్లో పూర్తి స్థాయి నీటిమట్టం పెరగకుండా తగినట్లు పైపులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పీహెచ్ స్థాయి తగ్గిపోతుందని, సున్నంను అవసరం మేరకు వాడాలన్నారు. చెరువుల చుట్టూ గట్లు బలహీనంగా ఉన్నట్లైయితే ఆ ప్రదేశంలో మట్టితో పటిష్టం చేయాలన్నారు. చెరువు చుట్టూ విద్యుత్ వైర్ల జాయింట్‌లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టుబడులు ఉన్నా, సీడ్ స్టాకింగ్ ఉన్న వాయిదా వేసుకోవాలని సూచించారు.

అప్రమత్తమైన అధికారులు

ఉండి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఆదివారం కూడా గ్రామ సచివాలయాలు, మండల కార్యాలయాలు యధావిధిగానే పనిచేశాయి. దీనిలో భాగంగా మండలంలోని రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సహకరించేందుకు త్రిసభ్య కమిటీని జిల్లా కలెక్టర్ నియమించినట్లు తహసీల్దార్ వై.శ్రీనివాస్ తెలిపారు. కమిటీలో తహసీల్దార్ వై.శ్రీనివాస్, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో కె.కొండలరావు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య సభ్యులుగా ఉన్నారు. ఆదివారం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో అధికారులు మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా యండగండి, ఉప్పులూరు, కోలమూరు, చిలుకూరు గ్రామాల్లో అధికారుల బృందం పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి పట్టుబడి అయిన ధాన్యాన్ని ఎటువంటి ఆలస్యం చేయకుండా వివరాలను ఆఫ్‌లైన్‌లోనే నమోదు చేసి సమీపంలో ఉన్న రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసామన్నారు. గ్రామ సచివాలయాల్లో కూడా అధికారులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆదివారం కూడా అధికారులు విధుల్లో ఉన్నారన్నారు. కాబట్టి రైతులకు ధాన్యం తరలింపులో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తనకు గాని, ఎంపీడీవోకు గాని, మండల వ్యవసాయాధికారికి గాని ఫోన్ చేసి సమస్య చెబితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు గానూ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసామన్నారు. ఇబ్బందులు ఎదురైతే రైతులు వెంటనే 94491041459 నంబర్‌కు గాని 9493742460, 8331056718 నంబర్లలో అధికారులను సంప్రదించాలని సూచించారు. తుపాన్ హెచ్చరికలతో ఆందోళన చెందకుండా సాధ్యమైనంత త్వరగానే ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. గ్రామాల్లో పర్యటించిన బృందంలో ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ ఉన్నారు.


ఉప్పులూరులో ట్రాక్టర్లపై ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న తహసీల్దార్, ఏఓ, ఏడీఏ

క్షేత్ర స్థాయిలో సేవాదళ్ సేవలను విస్తరింపజేయాలి

ఆకివీడు: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ విస్తృత సేవలందించాలని ఉమ్మడి జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ కో ఆర్డినేటర్ చినమిల్లి వెంకట్రాయుడు పిలుపునిచ్చారు. స్థానిక తాపీమేస్త్రీల సంక్షేమ భవనంలో ఆదివారం మండల సేవాదళ్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే భాగ్యం పార్టీ ద్వారా మనకు దక్కిందన్నారు. ప్రభుత్వ పథకాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందకపోతే వారికి లబ్ధి చేకూరే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సేవాదళ్ బ్రిటీష్ కాలం నుంచే ఉందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, మండల బూత్ కన్వీనర్ అంబటి రమేష్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే ఏసు, జిల్లా సేవాదళ్ కార్యదర్శి, మండల సేవాదళ్ అధ్యక్షుడు యర్రా కేశవ, కౌన్సిలర్ తిరుమారెడ్డి మాధవి, ఎండీ మాబూ, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన వైఎస్సార్ సీపీ సేవాదళ్ నాయకులు

హడావుడిగా మాసూళ్లు

కాళ్ల: తుపాను గండం వరి రైతుల గుండెల్లో గుబులు పుట్టించింది. ఆదివారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉండడంతో ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పంటను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. హడావుడిగా కోత మెషీన్లతో వరి కోతలు కోస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ఆరబెడుతూ పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో సుమారు 3,800 ఎకరాల్లో సార్వా సాగు చేశారు. ఇప్పటి వరకు 558 ఎకరాల్లో మాసూళ్ళు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే మండలంలో వేంపాడు, కోపల్లె, జక్కరం, బొండాడ, సీసలి, కాళ్ళ, కాళ్ళకూరు తదితర గ్రామాల్లో సార్వా మాసూళ్ళు ప్రారంభమయ్యాయని తెలిపారు. వాతావరణం అనుకూలించి మరో కొన్ని రోజులు వర్షాలు పడకుండా ఉంటే సార్వా పంటను కాపాడుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు.

తుపాను పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధం

నరసాపురం: తుపాను ప్రభావిత పరిస్థితులను సమర్థవంతంతగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్డీఓ తన ఛాంబర్‌లో బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాను కారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో ముందుగా తీరప్రాంత వాసులను అప్రమత్తం చేయాలని సూచించారు. తుఫాన్ తీవ్రత తగ్గే వరకూ పేరుపాలెం బీచ్‌కు ఎట్టి పరిస్థితుల్లోను సందర్శకులను అనుమతించవద్దని పోలీసు అధికారులకు సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వాకపల్లి ప్రసాద్, తహసీల్దార్లు ఎండీ ఫాజిల్, జి.అనితకుమారి, ఎంపీడీఓలు వీకే వీరభద్రరావు, యు.బాబ్జీరాజు, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ ఏడీ ఏడుకొండలు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ: తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ ఎంఏ అంబరీష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం వడలి, ఇతర గ్రామాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని జీపీఎస్ వాహనాల ద్వారా రైసుమిల్లులకు తరలించాలని సూచించారు. తహసీల్దార్ ఎస్.గురుమూర్తి రెడ్డి, ఏఓ పి.స్పందన ఉన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: తుపాను కారణంగా రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీస్ స్థానిక అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆలమూరు, వెలగలేరు, గ్రామాలలో పర్యటించి కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆలమూరులో రైస్ మిల్లును తనిఖీ చేశారు. తహసీల్దార్ డీవీ అశోక్‌వర్మ, ఎంపీడీఓ పద్మజ, వ్యవసాయ అధికారిణి అంగర జ్యోష్యుల, ఏఈఓ సత్యనారాయణ ఉన్నారు.


నరసాపురం: తుఫాన్‌పై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎంఏ అంబరీష్

'ప్రజలకు పార్టీలతో సంబంధం లేదు'

ఆకివీడు: ప్రజలు ధర్మకాటా లాంటివాళ్లని మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు అన్నారు. ఆయన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు పార్టీలతో సంబంధం లేదన్నారు. కార్యకర్తలు, నాయకులు బతికున్నంత కాలం నమ్ముకుని పార్టీలో ఉండాలన్నారు. ప్రజలు ఏ పార్టీ ఎలా పనిచేస్తుందో గుర్తించి ఓటు వేస్తారని చెప్పారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా నాయకు ఉండాలన్నారు. తెలంగాణాలో పార్టీ విజయానికి కృషి చేసిన వారికి ధన్యవాదాలు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఐక్యత నేడు చూపించారని చెప్పారు. కలిసి ఉంటే విజయం తథ్యమన్నారు. కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బాపిరాజు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు అన్నారు. మిగిలిన పార్టీలను విమర్శించనన్నారు. విమర్శలు తన రాజకీయ చరిత్రలో లేవని చెప్పారు. బలమైన ప్రజాస్వామ్య పునాదులతో కాంగ్రెస్ ఉందన్నారు. ఓటు హక్కే వజ్రాయుధమన్నారు. ఓటు హక్కు 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకు రాజీవ్ గాంధీ పాలనలో తీసుకువచ్చారని చెప్పారు. కాంగ్రెస్‌కు మరణంలేదని బాపిరాజు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రభువులని, వారిని కనిపెట్టుకునుంటే విడనాడరన్నారు. సమావేశంలో అంకెం సీతారామ్, జంపన సుబ్రహ్మణ్యంరాజు, వేగేశ్న వెంకట గోపాల కృష్ణంరాజు, చింతా ఆదిశేషు, సోడదాసి గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఏ రైస్‌మిల్లుకైనా తరలించుకోవచ్చు

పాలకోడేరు: రైతులు కోసిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా తమకు నచ్చిన రైస్‌మిల్లులకు తరలించుకోవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పాలకోడేరు మండలం కొరుకొల్లు గ్రామంలో ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో రైతులు తమ సొంత వాహనాలను జీపీఎస్ లేకపోయినా ఉపయోగించుకోవచ్చునని, ఆఫ్ లైన్ ద్వారా కూడా ధాన్యం అమ్మకాలు జరుపుకోవచ్చునని ఆయన తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలోనే మకాం వేయాలని, ఏ రైతుకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడా ఆరుబయట ధాన్యాన్ని రైతులు ఆరబోసుకోకుండా సురక్షిత ప్రాంతాలలో ఆరబెట్టుకొని వెనువెంటనే రైతు భరోసాల కేంద్రాల ద్వారా రైసు మిల్లర్లకు తరలించాలన్నారు. పుకార్లను, వదంతులను నమ్మవద్దని అధికారులు సూచనలు, సలహాలు పాటించాలని ఆయన కోరారు. జేసీ వెంట తహసీల్దారు షేక్ హుస్సేన్, వ్యవసాయ శాఖ అధికారి నారాయణరావు, రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో తీర ప్రాంత గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వై.రవికుమార్ సూచించారు. భీమవరం మండలంలోని నాగిడిపాలెం, లోసరి, దొంగపిండి గ్రామాలలో ఆదివారం తహశీల్దార్ వై. రవికుమార్, రూరల్ సీఐ నాగ కిషోర్ తీర ప్రాంత గ్రామస్తులు అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వై. రవికుమార్ మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ బాపట్ల, మచిలీపట్నం ప్రాంతాల మధ్య తీరం దాటుతుందని వాతావరణ శాఖ తెలిపిందని మన తీర ప్రాంత గ్రామాలకు తుఫాన్ ప్రభావం ఎక్కువ ఉంటుందని లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్నవారు ఎగువన పునరావాస కేంద్రాలకు రావాలన్నారు. సముంద్రం, ఉప్పుటేరు డ్రెయిన్‌లలో అలల ఉధృతి ఎక్కువగాఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్సై బి.మోహన్‌రావు, కార్యదర్శి కిరణ్, తిరుమాని ధనంజయ రాజు తదితరులు ఉన్నారు.


దొంగపిండి గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో ఇప్పటివరకూ ఒబ్బిడైన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రైతులకు మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. ఆదివారం భీమవరం మండలంలో ఆయన పర్యటించారు.

70 శాతం సంక్షేమం ఎస్సీ, ఎస్టీలకే

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ఏ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన వాటిలో 70 శాతం నిధులు దళితులకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అందజేస్తుందని ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు. భీమవరం వ్యవసాయ మార్కెటు కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు. అర్హత ప్రమాణికంగా పథకాలను అందిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులకు ఇచ్చిన ప్రాధాన్యత ఇతర ఏ రాష్ట్రంలో ఇవ్వలేదని అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇద్దరు, ముగ్గురు దళితులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని కానీ ఈ ప్రభుత్వంలో నూటికి నూరు శాతం దళితులకు న్యాయం జరిగిందన్నారు. సమావేశంలో భీమవరం ఏఎంసీ వైస్ చైర్మన్ శిరీష తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్

పేదలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు

తాడేపల్లిగూడెం రూరల్: పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండాలని కేంద్రంలోని మోడీ సర్కారు పథకాలను అమలు చేస్తోందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. మండలంలోని మాధవరం, ఉప్పరగూడెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కో కన్వీనర్ రామగాని సత్యనారాయణ, వీఆర్‌వీఎల్ నారాయణ, పన్నెంరెడ్డి నవీన్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత


బాపిరాజుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెలిదిండి మణికంఠ

వీరవాసరం: ప్రమాదంలో గాయపడిన రాయకుదురుకు చెందిన గాదిరాజు బాపిరాజు హైదరాబాద్‌లో ఉంటున్నారు. గ్రామ వలంటీర్ వెలిదిండి మణికంఠ అక్కడికి వెళ్లి ఆయనకు పెన్షన్ అందజేశారు. వలంటీర్‌ని సర్పంచ్ గెద్దం భారతి, అధికారులు అభినందించారు.

సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం


మాట్లాడుతున్న మంతెన సీతారాం

భీమవరం: సీపీఎం జిల్లా విస్తృత సమావేశం చాంబర్ ఆఫ్‌కామర్స్ హాలులో బి.వాసుదేవరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్రం నిత్యావసరాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.బలరాం, చింతకాయల బాబూరావు, జేఎన్‌వీ గోపాలన్, డి.కళ్యాణి, కేతా గోపాలన్ పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక వనసమారాధన


గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: కార్తీకమాసాన్నిపురస్కరించుకుని భీమవరం శ్రీకృష్ణ యాదవ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బైపాస్ రోడ్‌లోని సత్యస్ కల్యాణ మండపంలో కార్తీక అన్న సమారాధన కార్యక్రమం సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కారుమూరి సునీల్, రాష్ట్ర సాంస్కృతిక పరిషత్ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ ఇలాంటి కార్తీక సమారాధనలు మనందరినీ ఒకచోట చేర్చి స్నేహాన్ని, బంధుత్వాలను కలుపుతూ ఒకే వేదికగా నిలుస్తాయని అన్నారు. ముఖ్య అతిథులను సంఘ అధ్యక్షుడు గొరిపర్తి సత్యనారాయణ , గొరిపర్తి త్రినాథ్ తదితరులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంవీఆర్ అప్పాజీ, ఆబోతుల చిన్నరాజు, కైలా పాండు రంగారావు, కిలాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన చిల్డ్రన్స్ ర్యాంకింగ్ చెస్ పోటీలు


చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: శ్రీఅల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్కూల్ చిల్డ్రన్స్ ర్యాంకింగ్ చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ చిన్నారులు విద్యతో పాటు చెస్ పోటీ పోటీల్లో పాల్గొనడం ద్వారా మేథస్సును పెంపొందించుకోవచ్చన్నారు. చిన్నారులకు ఉపయోగపడేలా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం చెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల రాజు, ఝాన్సీ లక్ష్మి, ఎంఎస్ఎన్ రాజు, తోట హరిబాబు, వై.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో బాలోత్సవం

భీమవరం: పట్టణంలోని చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో ఈనెల 30, 31 తేదీల్లో బాలోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వసుధా ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన కృష్ణంరాజు, ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలోని శ్రీరాంపురం గాంధీ కస్తుర్బా భవనంలో ఆదివారం నిర్వహించిన బాలోత్సవ కమిటీ సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. సుమారు 4 వేల మంది బాలలతో కార్యక్రమం రూపొందించామన్నారు. మొత్తం 10 అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. భీమవరం పట్టణం, రూరల్, పాలకోడేరు, ఉండి, కాళ్ళ, వీరవాసరం మండలాల పరిధిలోగల ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కె.మురళీ కృష్ణంరాజు, పి.సీతారామరాజు, షేక్ వలీ, జి.జేమ్స్ పాల్గొన్నారు.

ముగిసిన ఓట్ల నమోదు

ఆకివీడు: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ముగిసిందని తహసీల్దార్ విజయలక్ష్మి ఆదివారం చెప్పారు. గత రెండు రోజులుగా ఓట్ల నమోదు, పేర్ల మార్పు వంటి కార్యక్రమాల్ని చేపట్టామన్నారు. మండలంలో మొత్తం 470 ఓట్ల నమోదు, మార్పులు, చేర్పులు జరిగినట్లు తెలిపారు. ఆదివారం ఒక్కరోజే 18–19 ఏళ్ల వయస్సున్న కొత్త ఓటర్లు 58 మంది, ఫారం–6 నమోదులో కొత్త ఓటర్లు 54, ఫారం–7 నమోదులో మరణించిన వారి ఓట్ల తొలగింపు 64, ఫారం–8లో పేర్లు, అడ్రస్సులు, పుట్టిన తేదీ మార్పు వంటివి 68 నమోదు చేసినట్లు ఆమె వివరించారు.

నేడు పెదపుల్లేరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఉండి: మండలంలోని పెదపుల్లేరులో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

అలరించిన హరికథ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్వితీయ హరికథా సప్తాహంలో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మినగర్ రోడ్డు నెంబర్ 4లో పురపాలక సంఘ మాజీ సభ్యుడు కర్రి ప్రభాకర్ బాలాజీ నివాసం వద్ద ఆదివారం రాత్రి తొలుత అన్నమయ్య కీర్తనలు, అనంతరం గుంటూరు వాస్తవ్యులు ముప్పవరపు సింహాచల శాస్త్రి భాగవతార్‌చే శంకర విజయం హరికథ వైభవంగా నిర్వహించారు. మృదంగంపై సరస్వతుల హనుమంతరావు, వయోలిన్‌పై వీరా శివ ప్రసాద్ సహకరించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు తదితరులు హాజరయ్యారు.

దానేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసి యున్న శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన కాపకాయల మోహన్‌సాయి నారాయణ రూ.21 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ విరాళానికి సంబంధించిన చెక్కును అందజేసినట్లు తెలిపారు.

చెస్‌లో బంగారు పతకం

పెంటపాడు: యోగా ద్వారానే ఏకాగ్రత కలిగి చెస్‌లో బంగారు పతకం సాధించినట్లు గూడెంకు చెందిన కె.నాగసాయి గణేష్ తెలిపారు. ఆదివారం యోగా టీచర్ జి.రూప ఆధ్వర్యాన మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో కోడే వెంకట్రావు దగ్గర యోగాసనాలు నేర్చుకున్న తాను ఇటీవల నిర్వహించిన చెస్ పోటీలలో గోల్డ్ మెడల్ అందుకున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తణుకు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం తణుకులో ఎన్నుకున్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి హాజరయ్యారు. జిల్లా గౌరవ అధ్యక్షునిగా ఎ.నాగార్జున(పెద్దతాడేపల్లి), అధ్యక్షునిగా ఎస్ఆర్ అప్పారావు(రేలంగి), ప్రధాన కార్యదర్శిగా వేదాల ఉదయ్(పాలకొల్లు), కోశాధికారిగా చొప్పర సుందర్‌కుమార్ (పాలకోడేరు), నిర్వహణ కార్యదర్శిగా కోమర్తి శ్రీనివాసు (తేతలి), ఉపాధ్యక్షులుగా కట్టా వెంకటేశ్వరరావు, (జగన్నాధపురం), బడుగు చంద్రశేఖర్ (పెద్దతాడేపల్లి) ఎన్నికయ్యారు.

వైభవంగా గణపతి హోమం


గణపతి హోమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధిలో ఉన్న రామాలయంలో అయ్యప్ప స్వాములు గణపతి హోమం నిర్వహించారు. ఆదివారం వేకువజామున మారుతి స్వామి పీఠం ఆధ్వర్యంలో సుమారు 40 మంది అయ్యప్ప స్వాములు గణపతి హోమంలో పాల్గొన్నారు. కడియాల శ్రీనివాసు బ్రహ్మత్వంలో హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 35వ పర్యాయం మాల ధరించి స్వామివారి సన్నిధికి వెళుతున్నట్లు మారుతి స్వామి తెలిపారు. హోమం అనంతరం స్వాములకు ఇరుముళ్లు కట్టి సాయంత్రం శబరిమల పయనమయ్యారు. తుఫాన్ కారణంగా రైళ్లు రద్దు కావడంతో బస్‌లో శబరిమలై వెళుతున్నట్లు స్వాములు తెలిపారు.